ఉచిత కంప్యూటర్ శిక్షణ

ముషీరాబాద్: సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్‌ఆర్‌డీ) ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో వంద రోజుల శిక్షణ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎస్‌ఆర్‌డి డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్స్ ఆఫ్ అకౌంటింగ్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్, డిజిటల్ లిట్రసీ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కంప్యూటర్ టైపింగ్ తదితర శిక్షణను ప్రతి రోజు ఉ.10 గం నుంచి మ. 2 గం వరకు, మ. 2.30 గంనుంచి 6.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు రాంనగర్‌లోని వేపూర్ బాలయ్య భవన్‌లోని ఎస్‌ఆర్‌డీ స్కిల్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

ముషీరాబాద్‌లో నామినేషన్లు నిల్

కవాడిగూడ: ముషీరాబాద్ ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటికి అభ్యర్థులు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదని ముషీరాబాద్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.లక్ష్మీనారాయణ తెలిపారు.

కలిసి వచ్చిన బీసీ నినాదం



అంబర్‌పేట్: నగర రాజకీయాలను ప్రభావితం చేసి సుదీర్ఘ విరామం అనంతరం మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. 1986లో కార్పొరేటర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన దాదాపు 20 ఏళ్ల పాటు నగరంలో కీలక నాయకుడిగా ఉన్నారు. కొన్ని పరిణామాలతో రాజకీయాలకు దూరం కావాల్సి వచ్చింది. 2004 నుంచి అంతగా ప్రభావం లేకుండా పరోక్ష రాజకీయాలు చేస్తూ వచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఉన్న అనుబంధంతో 2016లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అందులో క్రియాశీల పాత్ర పోషిస్తారని అంతా భావించినా కృష్ణయాదవ్ అందుకు తగిన అవకాశం రాలేదు. బీఆర్ఎస్ పార్టీలో నామమాత్రంగా కొనసాగుతూ వచ్చారు.

అనూహ్యంగా బీజేపీలోకి...

అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యేకు తిరిగి అవకాశం రావడంతో కృష్ణయాదవ్ బీజేపీ వైపు అడుగులు వేశారు. ఈటల రాజేందర్ సహకారంతో నెలరోజుల క్రితం తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. అప్పటినుంచి అంబర్‌పేట టికెట్‌పై అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. బీజేపీ చేపట్టిన బీసీ నినాదం కొంత కలిసి వచ్చింది. అంతేకాకుండా అంబర్‌పేటతో సుదీర్ఘ అనుబంధం, మంత్రిగా అందించిన సేవలను బీజేపీ పరిగణలోకి తీసుకుంది. నేరుగా టికెట్ ఇచ్చి బరిలోకి దింపింది.

బీజేపీ నేతలు సహకరిస్తారా?...

బీజేపీ మొదటి నుంచి క్రమశిక్షణ, సిద్ధాంతలతో నడుస్తుంది. అంబర్‌పేట్‌లో 40 ఏళ్లుగా జెండా మోసిన నాయకులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి చిన్న చిన్న అవకాశాల కోసం ఎదురు చూశారు. అంబర్‌పేట నుంచి జాతీయ స్థాయి నేతల వరకు ఉన్న జెండా మోసిన కార్యకర్తలకు మాత్రం న్యాయం జరగలేదనే భావన ఉంది. నెలరోజుల క్రితమే వచ్చిన కృష్ణయాదవ్‌తో కలిసి పనిచేయాలని పార్టీ నిర్ణయించడంపై కొందరు అసంతృప్తిగా ఉన్నారు. తాము పని చేయడానికే పనికొస్తామా అనేలా పరోక్షంగా మనస్తాపానికి గురువుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కృష్ణయాదవ్‌కు బీజేపీలోని కొందరు సీనియర్ నాయకులు, కార్యకర్తలు నుంచి ఏమేరకు సహకారం అందుతుందో వేచి చూడాల్సిందే.

కృష్ణయాదవ్‌కు అనూహ్యంగా బీజేపీ టికెట్
- సుదీర్ఘ విరామం తర్వాత బీజేపీ వేదికగా క్రియాశీల రాజకీయాల్లోకి
- బీసీ, అంబర్‌పేట అనుబంధంతోనే టికెట్
- బీజేపీ శ్రేణులు సహకరించేనా?

అధ్యక్షునికి దక్కని టికెట్...

బీజేపీలో అధ్యక్ష బాధ్యతలు నిర్వహించే వారికి టికెట్ కేటాయింపులో మొదటి ప్రాధాన్యం ఇవ్వడం ఆనవాయితీ. అయితే అంబర్‌పేట టికెట్ విషయంలో అందుకు భిన్నంగా జరిగింది. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు గత మూడేళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అంతేగాక అంబర్‌పేట టికెట్‌పై ఆశలు పెట్టుకున్న అతను ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాజకీయ వారసునిగా గౌతమ్‌రావేనని అంతా భావించారు. ఇన్ని అర్హతలు ఉన్న గౌతమ్‌రావుకు టికెట్ రాకపోవడం పట్ల అందరూ ఆశ్చర్యపోతున్నారు. పార్టీ సమీకరణలను స్థానిక బీజేపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నట్లు సమాచారం. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా గౌతమ్‌రావు అంబర్‌పేట, ఖైరతాబాద్, నాంపల్లి, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టతకు కృషి చేసినా తీరా ఆయనకు ఎక్కడా టికెట్ దక్కలేదు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

- ముషీరాబాద్ అభ్యర్థి ఎం.అంజన్ కుమార్ యాదవ్



మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న అంజన్ కుమార్ యాదవ్

చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ అభ్యర్థి, టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సీనియర్‌లతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పలు బస్తీలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు అంజన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే ఎంతో అబివృద్ధి జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఇంటికి పంపేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ముషీరాబాద్ నియోజవర్గ ప్రజలు ఆశీర్వదిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి పనిచేస్తానని తెలిపారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, కాంగ్రెస్ నాయకులు కెన్నడీప రాజు(జాన్ కెన్నడీ), వాజీద్ హుస్సేన్, కల్పనాయాదవ్, మేడి సురేష్, గుర్రం శంకర్, గుర్రం చంద్రకళ, మధుమతి, వై.సంజీవరెడ్డి, భూకల కృష్ణయాదవ్, సురేష్‌యాదవ్, జయ, జానికి సుధాకర్, పుస్తకాల కవిత, టీజేఎస్ నేతలు శ్రీనివాస్‌యాదవ్, గుండెల్లి రవీందర్, అజయ్‌గౌడ్, వెంకన్న పాల్గొన్నారు.

'అంబర్‌పేట'ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా



అవ్వను ఓటు అభ్యర్థిస్తున్న అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని గోల్నాక డివిజన్‌లో ఎన్నికల ప్రచార పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని సుందర్‌నగర్, అంజుమన్ బాడా, శ్యామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యేకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు దోహదపడతాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని, అభివృద్ధికే పట్టం కట్టాలని ఆయన కోరారు. పేద ప్రజలను ఆదుకున్న సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించి, మళ్లీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలన్నారు. బీఆర్ఎస్ నేతలు, కార్యర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

కాచిగూడ: ఉద్యోగ, ఉపాధి అవకాశాల సాధనకు యువత సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణగూడలో డీవైఎఫ్ఐ నగర కార్యాలయం వద్ద ఆయన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికి విద్య, ఉపాధి అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. యువతకు ఉపాధి కల్పన కేంద్రాలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టారని, చిన్న చిన్న పరిశ్రమలు మూతపడేలా చేయడంతో 6 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. కేంద్రంలో 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క నోటిఫికేషన్ వేయకుండా యువతను మోసం చేసిందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించని బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలకు ఈ ఎన్నికల్లో యువత తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావేద్, రాజేష్, నరేష్, బాలు, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య సోషలిజం స్థాపనే లక్ష్యం : బోద్రమోని పురుషోత్తం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజాస్వామ్య, సోషలిజం స్థాపనే సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా లక్ష్యమని పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి బోద్రమోని పురుషోత్తం అన్నారు. మత రాజకీయాలకు దూరంగా ఉంటూనే దేశంలో ఉపాధి, ఆహారం, నివాసం వంటి క్లిష్టమైన సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సూర్యనగర్‌లో సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు విద్య, వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. 1934లో లోక్‌నాయక్ డాక్టర్ జయప్రకాష్ నారాయణ స్థాపించిన సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.యూనస్, పి.సుజాత, ఎం.రామస్వామి, రామచందర్, సాయినాథ్, యూనస్, విద్యార్థి సంఘం నాయకులు భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

అంబర్‌పేట్: గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్‌లో విద్యుత్ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యుత్ శాఖ ఏడీఈ ఇంజనీర్ శీనయ్యకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఏడీఈ కార్యాలయంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు చింతాల శ్రీనివాస్ ముదిరాజ్ కాలనీవాసులతో కలిసి కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఏడీకి వివరించారు. కాలనీలో వర్షాలకు పలు విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మరాయన్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఏడీఈ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు అనిల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉపాధి కల్పన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేద విద్యార్థులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పని చేస్తామని కేశవ స్మృతి సంవర్ధన సమితి అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో కేశవ స్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం బర్కత్‌పురా సహకారంతో పేద విద్యార్థులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఇచ్చే ఉచిత శిక్షణతో అనేక మంది ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ అధినేత కె.ఉపేందర్, కేశవ స్మృతి సంవర్ధన సమితి ప్రతినిధులు రామచందర్, సిద్ధిరాఘువేంద్ర, సునీల్ కులకర్ణి, కొప్పారపు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయం చేయండి

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 11న సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గజ్జల రాజశేఖర్ మాదిగ అన్నారు. శుక్రవారం ఇందిరానగర్‌లో విశ్వరూప మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. సభకు పెద్ద ఎత్తున మాదిగ కులస్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎల్లయ్య, రాజు, శ్రీహరి, చిన్నా, బాలు, లోకేష్, రాహుల్, నరేందర్, యాదమ్మ, మైనార్టీ కమిటి నాయకులు ఇస్మాయిల్, మహ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

బోస్ బాబును కలిసిన అభిషేక్‌రెడ్డి



ఏఐసీసీ పరిశీలకులు బోస్, కోదండరెడ్డిలతో అభిషేక్‌రెడ్డి, జిఎస్ కేశవ్

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తిగా ఉంటూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య మనువడు అభిషేక్‌రెడ్డి పార్టీ మారుతున్నట్లు ఉహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి అభిషేక్‌రెడ్డితో పాటు జి.ఎస్.కేశవ్, నాగేంద్రప్రసాద్ తదితరులు అతడితో మాట్లాడి నచ్చజెప్పారు. ఆయనను ఏఐసీసీ పరిశీలకులు బోస్ బాబు వద్దకు తీసుకెళ్లారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆయన పార్టీ విజయం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మొదటిరోజు ఒక్కటే నామినేషన్

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గం మొదటి రోజు ఒక నామినేషన్ దాఖలైంది. అంబర్‌పేట సీపీఎల్ రోడ్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శివసేన పార్టీ (ఉద్ధవ్‌థాక్రే) అభ్యర్థిగా ఏ. సుదర్శన్ నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారిని అపర్ణకు అందజేశారు. నామినేషన్ ప్రక్రియకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశారు. వంద మీటర్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

5న బాలానందంలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

కాచిగూడ: బాలానందం వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 5న ఆదివారం బాలబాలికలకు ఫ్యాన్సీడ్రెస్, నీతి పద్యాలు, భక్తీ గీతాల పోటీలు నిర్వహించనున్నట్లు బాలానందం కార్యాలయ కార్యదర్శి లావణ్య తెలిపారు. ఆదివారం ఉదయం 11 చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్, నీతి పద్యాలు పోటీలు, మధ్యాహ్నం 1:30 గంటలకు సబ్‌జూనియర్స్, జూనియర్స్ విభాగాల్లో భక్తి గీతాలు, నీతి పద్యాలు పోటీలు ఉంటాయని తెలిపారు. నారాయణగూడ లోని బాలానందంలో జరిగే ఈ పోటీల్లో బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభ పాతవాలను చాటుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్: 040- 27561443.

అంబర్‌పేట గడ్డ.. బీజేపీ అడ్డా

- కుటుంబ పాలనను అంతమొందిద్దాం
- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణయాదవ్



మాట్లాడుతున్న అంబర్‌పేట బీజేపీ అభ్యర్థి కృష్ణ యాదవ్

నల్లకుంట: అంబర్‌పేట నియోజక వర్గం బీజేపీ అడ్డా అని, నియోజక వర్గంలో కాషాయ జెండా ఎగురవేస్తామని మాజీ మంత్రి, బీజేపీ అంబర్‌పేట నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సి. కృష్ణా యాదవ్ అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ పాలన కొనసాగుతోందన్నారు. అవినీతి పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణ యాదవ్ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి సారి ఎన్నికలకు ముందే బీసీ నేతను ముఖ్య మంత్రిని చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించడం అభినందనీయమన్నారు. దీంతో బీసీలు బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అంబర్‌పేట చే నంబర్ చౌరస్తా వద్ద నిర్మిస్తున్న ఫ్లైవర్ బ్రిడ్జి ద్వారా మంత్రి బీజేపీకి ఎక్కడ పేరొస్తుందోనని, నిర్మాణ పనులకు స్థలం మంజూరు చేయడంలో జాప్యం చేస్తూ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. గతంలో తమ నాయకుడు ఆలె నరేందర్, తాను రెండు పర్యాయాలు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజక వర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అభివృద్ధి పనుల పేరిట నియోజక వర్గంలో కమీషన్ల కోసం గతంలో వేసిన రోడ్లనే తవ్విపోసి మళ్లీ రోడ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీకి కేవలం ధన బలం మాత్రమే ఉందని, ప్రజా బలం లేదన్నారు. నియోజక వర్గంలో తమ పార్టీకి బూత్ స్థాయిలో పటిష్ట నాయకత్వం ఉందని, నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి బీజేపీ విజయానికి కృషి చేయాలన్నారు. బీజేపీ అధిష్టానం తనకు అంబర్‌పేట టికెట్ కేటాయించడం పట్ల ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షా, కిషన్ రెడ్డిలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకు వెళ్లాలని కోరారు. శ్రీనివాస్ రెడ్డి, నంద కిశోర్ యాదవ్, వై. అమృత, జయ్ కుమార్, మురళీధర్ రాజ్, కేసరి నర్సింగ్ రావు, ఎం.మధు యాదవ్, బీజేపీ జిల్లా కార్యదర్శి కత్తుల సుదర్శన్, అధికార ప్రతినిధి ఏడెల్లి అజయ్ కుమార్, ఆయా డివిజన్ల అధ్యక్షుడు చుక్క జగన్, నాగభూషణ చారి, మూల రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ముషీరాబాద్ అభివృద్ధి



భోలక్‌పూర్ బడీ మసీద్ వద్ద ముస్లింలను ఓటు అభ్యర్థిస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: బీఆర్ఎస్ పాలనలో ముషీరాబాద్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ అన్నారు. ఆయన శుక్రవారం భోలక్‌పూర్ బడీ మసీద్ వద్ద డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ప్రార్థనలు ముగించుకోని బయటకు వచ్చిన ముస్లింలను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేసి ముఠా గోపాల్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో మత ఘర్షనలు లేవని, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ గత ఐదేళ్లలో ముషీరాబాద్‌లో సుమారు రూ.1100 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ కమిటి రాష్ట్ర నాయకులు షరీఫ్, రహీం, జువేద్‌బాగ్దాదీ, డివిజన్ మైనార్టీ కమిటి అధ్యక్ష, కార్యదర్శులు మగ్బూల్, జబ్బార్, నాయకులు అతిక్ ఉర్ రహమాన్, అగ్బర్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అన్యాయం చేశారు

- సికింద్రాబాద్ జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు లక్ష్మీ పద్మజ



చిక్కడపల్లి: బీజేపీ కార్యకర్తగా 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్న తనకు మహిళా కోటాలో ముషీరాబాద్ టికెట్ కేటాయించకపోవడం పట్ల పార్టీ సికింద్రాబాద్ జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు లక్ష్మీ పద్మజ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆమె వివేక్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో వివిధ స్థాయిల్లో క్రమశిక్షణతో పార్టీకి సేవలందించినట్లు తెలిపారు. తాను టిక్కెట్ కోసం దరఖాస్తు చేశానని తెలిపారు. అధిష్టానం నుంచి సానుకూల స్పందన రావడంతో ముషీరాబాద్ టికెట్ వస్తుందని నమ్మకంతో ఎదురుచూశానని తెలిపారు. అయితే వేరేవారికి టికెట్ కేటాయించడంతో నిరాశకు గురయ్యానన్నారు. బ్రహ్మణ సామాజికవర్గానికి చెందిన తనను తనను ఓసీ అభ్యర్థి అయినందున చివరి నిముషంలో తనను అధిష్టానం పక్కన పెట్టడం ఆవేదనకు గురి చేసిందని తెలిపారు.

బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడిగా రాజేందర్ పటేల్ గౌడ్



కాచిగూడ: బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడిగా రాజేందర్ పటేల్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ, ప్రతినిధుల సమావేశంలో రాజేందర్ పటేల్ గౌడ్‌ను జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి పోటీ చేసే బీసీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. బీసీ అభ్యర్థుల గెలుపుకోసం బీసీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీసీల రాజ్యాధికార సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ మహాసభ ప్రతినిధులు పులిజాల కృష్ణ, మెట్టు ముత్యాలరావు, భూషణ్ భాస్కర్, సీహెచ్ ప్రదీప్ గౌడ్, ధరణీధర్ యాదవ్, నల్లెల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం నిల్వ చేస్తే కఠిన చర్యలు



సీఐ రామకృష్ణ

ముషీరాబాద్: ఎన్నికల నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం నిల్వ చేసినా, అనుమతులు లేకుండా మద్యం సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ డి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యంపై విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 30 కేసులు నమోదు చేసి రూ. రూ.1.4 లక్షల విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వలు, సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 18004252523, స్టేషన్ నెంబర్ 8712659642లో సమాచారం ఇవ్వాలని కోరారు. మద్యం వినియోగారులు వేరి ఇట్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని మద్యం వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు. స్టేషన్ పరిధిలో 29 వైన్ షాపులు, 20 బార్‌లు, 10 కల్లు కంపౌండ్‌లు కొనసాగుతున్నాయని, వీటిపై ప్రత్యేక నిఘా పెట్టి సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ముఠా గోపాల్ విజయానికి కృషి

ముషీరాబాద్: ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తానని యువ నాయకుడు సాయిగౌడ్ అన్నారు. ఈ నెల 5న ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్‌ను మూడోసారి గెలిపించుకోని తెలంగాణను మరింత అభివృద్ధి చేసుకుంటామన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి ముషీరాబాద్‌ను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దారని కొనియాడారు. పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి చేస్తామన్నారు.

కాంగ్రెస్‌కు పూస శ్రీకృష్ణ రాజీనామా



ముషీరాబాద్: ముషీరాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పూస శ్రీకృష్ణ పార్టీకి రాజీనామా చేశారు. 2009లో భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందారు. ఆయన తండ్రి పూస స్వామి ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆయనను హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా నియమించింది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో తన సోదరుడు పూస రాజుకు ముషీరాబాద్ బీజేపీ టికెట్ కేటాయించడంతో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ తన తమ్ముడి గెలుపు కోసం సాయశక్తుల కృషి చేస్తానని ప్రజలు కూడా మద్దతు తెలపాలని కోరారు.

బీఆర్ఎస్‌కు మారిశెట్టి గుడ్‌బై



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు మారిశెట్టి నర్సింగ్‌రావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. శుక్రవారం సాయంత్రం జవహర్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో సీనియర్‌లకు గౌరవం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నామినేటెడ్ పోస్టులు ఇవ్వలేదని, పార్టీ పదవులు కూడా ఇవ్వలేదని సీనియర్ల సేవలు వినియోగించుకోవడం తప్ప తమకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌పై అభిమానంతో తాము టీడీపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరితే ఎలాంటి ప్రాధాన్యం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తన తోటి నాయకులు, కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు తెలిపారు. త్వరలోనే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మారిశెట్టి నర్సింగరావు పేర్కొన్నారు.

సికింద్రాబాద్ మహిళా సేవా దళ్ అధ్యక్షురాలిగా పట్నం స్వప్నగౌడ్



పట్నం స్వప్నగౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న లాల్‌జీ దేశాయ్

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు పట్నం స్వప్నగౌడ్ సికింద్రాబాద్ జిల్లా మహిళా సేవాదళ్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు.ఈ మేరకు శుక్రవారం ఆమెకు ఆలిండియా కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ లాల్‌జీ దేశాయ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పట్నం స్వప్నగౌడ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మహిళలంతా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేలా విస్తృతంగా ప్రచారం చేస్తా నని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా క్రమశిక్షణతో పని చేస్తానన్నారు. ముషీరాబాద్‌లో అంజన్‌కుమార్‌యాదవ్ గెలుపునకు అంకితభావంతో కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

రేపు దసరా మిలాప్



దసరా మిలాప్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ దళిత వేదిక నాయకులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 5న ఆదివారం ఉదయం దసరా మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక నాయకులు తెలిపారు. శుక్రవారం రాంనగర్‌లోని ఎస్ఆర్‌టీ పార్కులో సమావేశమై దసరా మిలాప్‌కు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు గజ్జల సూర్యనారాయణ, రూప్లా వివేకానంద, గద్దం నవీన్, జంబిక తిరుమలరావు, ఎం.భాస్కర్, ఆర్.జనార్ధన్, ఎర్రం శేఖర్, హరీష్, బి.రమేష్, కె.మధు, ఈ.సత్యనారాయణ, కేశవపురం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ అభ్యర్థుల విజయానికి కృషి



మాట్లాడుతున్న దాసు సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలను పెద్ద సంఖ్యలో గెలిపించడమే తమ ధ్యేయమని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సమితి రాష్ట్ర కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన బీసీ నేతలు పెద్ద సంఖ్యలో సమితిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు తగినన్ని ఎమ్మెల్యే సీట్లు కేటాయించని పక్షంలో తగిన గుణపాఠం తప్పదన్నారు. అగ్రవర్ణాలు పోటీ చేసే చోట బీసీలను నిలబెట్టి వారికి అండగా నిలుస్తామన్నారు. బీసీల ఓటు బీసీలకు వేసుకునే విధంగా కృషి చేస్తామన్నారు. 10 మంది అభ్యర్థులను బరిలో నిలుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో బహుజన ముక్తి మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి బీకే కెనియా, జాతీయ ఉపాధ్యక్షులు దాసు రాంనాయక్, బీఎస్పీ పార్టీ వరంగల్ కన్వీనర్ పద్మ, సమితి గ్రేటర్ అధ్యక్షురాలు బండారు పద్మావతి, ప్రధాన కార్యదర్శి దుర్గేష్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడికి ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు.



మాట్లాడుతున్న పూస రాజు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో మొట్టమొదటిసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు స్థానికుడైన తనకు బీజేపీ అవకాశం ఇచ్చిందని ఒక్కసారి తనను గెలిపించాలని ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి రాజకీయాల్లో ఉన్న తన కుటుంబ సభ్యులు నియోజకవర్గానికి ఎంతో సేవ చేశారన్నారు. 1967లోనే తన తండ్రి పూస స్వామి రాంనగర్ కౌన్సిలర్‌గా పని చేసినట్లు తెలిపారు.తనకు టికెట్ ఇచ్చిన రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇస్తూ బీసీ అభ్యర్థినే రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేస్తామని ప్రకటించడంతో బీసీలందరూ బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని తెలిపారు. అందరిని కలుపుకుని ముషీరాబాద్‌లో బీజేపీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మహంకాళీ జిల్లా అధ్యక్షులు మద్దూరి శివాజీ, బీజేవైఎం నాయకులు రాజ్‌కుమార్, ఆయూష్ తదితరులు పాల్గొన్నారు

నాకు అన్యాయం చేశారు..

- బీజేపీ మహంకాళీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీకే శంకర్‌రావు



సీకే శంకర్‌ను ఓదారుస్తున్న బీజేపీ నాయకులు

ముషీరాబాద్: ముషీరాబాద్ బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డ బీజేపీ మహంకాళీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీకే శంకర్‌రావును ఆ పార్టీ నాయకులు శుక్రవారం అతడి ఇంటికి వెళ్లి ఓదార్చారు. వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు లోనవడంతో నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లకు చెందిన బీజేపీ నాయకులు పద్మశాలి కాలనీలోని ఆయన ఇంటికి వెళ్లి ఓదార్చారు. టికెట్ రాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సి.కె.శంకర్‌రావు మాట్లాడుతూ గత 45 ఏళ్లుగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నాని సీనియర్నైన తనకు టికెట్ ఇవ్వకుండా పార్టీ అధిష్టానం అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు టికెట్ ఇవ్వకపోవడానికి గల కారణాలను పార్టీ అధిష్టానం వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.లక్ష్మణ్ విజయానికి ఎంతో కృషి చేశానని పార్టీ ఏ పని అప్పగించినా క్రమ శిక్షణతో పని చేసినట్లు తెలిపారు. పార్టీ అభ్యర్థి టికెట్ ప్రకటించే సమయంలో స్థానికులను సంప్రదించకుండానే ఎలా కేటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీజేపీ తరఫున ముషీరాబాద్ టికెట్ ఆశిస్తున్నట్లు పలుమార్లు నాయకుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఎన్నికల్లో బరిలో దిగేందుకు నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళీ జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షులు కృష్ణ, అధికార ప్రతినిధి చంద్రమోహన్, డివిజన్ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ఉమా, హైమా, సత్యనారాయణ, గుండ్ల రాజు, ధర్మేందర్, శంకర్‌నాయక్ తదదితరులు ఉన్నారు.